
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 28 నవంబరు 2025



పల్లె పోరు షురూ..



వార్డు సభ్యుల స్థానాలకు 33 నామినేషన్లు

మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 48 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 33 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా పంచాయతీ అధికారి (ఎఫ్ఏసీ) రఘువరన్ ప్రకటించారు. సర్పంచ్ స్థానాలకు బీమారం మండలంలో 13 నామినేషన్లు, ఇబ్రహీంపట్నంలో 5, కథలాపూర్‌లో 13, కోరుట్లలో 6, మల్లాపూర్‌లో 6, మెట్‌పల్లిలో 8 నామినేషన్లు దాఖలు అయినట్లు ప్రకటించారు. వార్డు సభ్యుల స్థానాలకు బీమారం మండలంలో 11, ఇబ్రహీంపట్నం మండలంలో 2, కథలాపూర్ మండలంలో 9, కోరుట్ల మండలంలో 5, మల్లాపూర్ మండలంలో 1, మెట్‌పల్లి మండలంలో 5 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మేడిపల్లి మండలంలో తొలిరోజు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదని డీపీవో రఘువరన్ తెలిపారు.

- తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 48 నామినేషన్లు..
- గెలుపు కోసం ప్రధాన పార్టీల వ్యూహాలు
- ఓటర్ల మద్దతు కోసం ఆశావహుల ఆరాటం
- మొదటి విడతలో 122 పంచాయతీలు, 1,172 వార్డులకు ఎన్నికలు

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే నాయకులు బిజీగా మారారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. జిల్లాలో తొలి విడతలో 122 పంచాయతీలు, 1,172 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండు, మూడో దశ ఎన్నికలతో పోలిస్తే తొలి విడతలో పోటీ చేసే నాయకులకు గడువు తక్కువగా ఉంది. దీంతో ఆయా చోట్ల పోటీ చేసేవారంతా సర్పంచ్‌లుగా గెలిచి తమ పార్టీ బలం చూపేందుకు సిద్ధమయ్యారు. జనరల్, మహిళా స్థానాల్లో అధిక పోటీ నెలకొంది. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలు, రాజకీయ చైతన్యం అధికంగా ఉన్న గ్రామాల్లో పోటీ పెరుగుతోంది.

పల్లెల్లో పట్టు కోసం ముమ్మర యత్నాలు

అధికార కాంగ్రెస్ పార్టీతో సహా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఇతర రాజకీయ పార్టీలు తమ మద్దతు దారులు గెలిచేలా నాయకులు నేరుగా రంగంలోకి దిగారు. పోటీ జరిగే స్థానాలు అధిక జనాభా, ఓటర్లు ఉన్న స్థానాలు, తమకు పూర్వం నుంచి బలం ఉన్న గ్రామాల్లో ఆశావహుల పేర్లతో జాబితా సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల మండలాల పరిధిలో నాయకులు, కేడర్‌ను సన్నద్ధం చేసింది. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావులు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై దృష్టి సారించి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, బీజేపీలో ఎంపీ అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబుతో పాటు ఆపార్టీ నాయకులు వ్యవహారాలను చూసుకుంటున్నారు.

వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లో కాం గ్రెస్ వ్యవహారాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీజేపీ పార్టీ నియోజకవర్గం నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డిలు వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో పర్యటిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు పంచాయ తీ ఎన్నికల తర్వాత పరిషత్, ఆపై మున్సిపాలిటీ ఎన్నికలు జరగనున్న తరుణంలో గ్రామ స్థాయి నుం చి స్థానిక సంస్థల్లో అధిక స్థానాలు

మిగతా 8లో..

ఉపన్యాస పోటీలు

కథలాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ లాంగ్వేజి టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో విద్యార్థులకు ఉపన్యాస, టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిచారు. టాలెంట్ టెస్ట్ సీనియర్ విభాగంలో నిరుపమ, సీనియర్స్ విభాగంలో శ్రీహిత, ఉపన్యాస పోటీలు జూనియర్స్ విభాగంలో విష్ణువర్ధన్, సీనియర్స్ విభాగంలో నిత్య అదేవిధంగా కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో లోకిని శ్రీనివాస్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి పాటిల్ దరందీప్, కన్వీనర్ సంజీవ్‌రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో దత్త పారాయణం

జగిత్యాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయా దేవాలయంలో శ్రీ గురు చరిత్ర దత్త పారయాణాన్ని గురువారం ప్రారంభించారు. డిసెంబరు 4న శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో దత్తాత్రేయ స్వామి చిత్రపటాన్ని ప్రతిష్ఠించారు. గురు దత్తుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు, అయ్యప్ప దీక్షా స్వాములు పారాయణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బోగ గంగాధర్ స్వామి, ప్రధాన కార్యదర్శి గాదాసు రాజేందర్, బోగ రాజు, మ్యానపురి మహేష్, కొక్కుల ప్రభాకర్, ఆలయ ప్రధాన అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్‌గర్ల్-1గా మ్యాన మహాశ్రీ, హెడ్‌గర్ల్-2గా మిట్లపెల్లి వైష్ణవి ఎన్నికయ్యారు. అలాగే హౌజ్ లీడర్లుగా రుద్రోజి శరణ్య, దీక్షిత, తబసుమ్, ఎం.శ్రీజ ఎన్నిక కాగ హెచ్‌ఎం నీరజ, ఉపాధ్యాయులు, పీడీ అంజయ్య అభినందించారు.

బీసీలకు ద్రోహం చేసిన కాంగ్రెస్

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 17 శాతం రిజర్వేషన్‌తో సరిపెట్టి వారిని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ విమర్శించారు. గురువారం మండలంలోని పెంబట్ల గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ కులగణన సర్వే ఒక తప్పుల తడకబీసీ సంఖ్య తక్కువ చూపించి బీసీలను అవహేలన చేశారని మండిపడ్డారు. బీసీలను నమ్మించి మోసం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచి పోతుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, సీనియర్ నాయకులు సాగిసత్యం రావు, ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, ఎండబెట్ల ప్రసాద్, బైరి మల్లేష్, ప్రభాకర్, సంతోష్, భాస్కర్ నాయక్, అరవింద్, రామానుజన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం జగిత్యాల అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

కోరుట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నిక నియమావళిని కచ్చితంగా పాటించాలని, నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఎన్నికల అధికారులకు సూచించారు. గురువారం కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట క్లస్టర్ పరిధిలోని గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల అధికారులకు సూచనలు సలహాలను అందించారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో ఎన్ని నామినేషన్ పత్రాలను అభ్యర్థులు తీసుకున్నారన్న విషయంపై ఆరా తీసారు. ఎలాంటి పొరపాట్లు జరకుండా నామినేషన్ల ప్రక్రియన నిర్వహించాలని, . దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రంకు సకాలంలో రిపోర్టులను పంపిచాలన్నారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రత ఏర్పాట్లు, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రతి నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జీవకర్ రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణచైతన్య పాల్గొన్నారు.



కొండాపూర్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

నామినేషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

●**మేడిపల్లి:** మేడిపల్లి మండలం మేడిపల్లి, కొండాపూర్, కల్వకోట, విలాయతాబాద్, కట్లకుంట, తొంబర్రావుపేట, పోరుమల్ల, గూడ్లపల్లె గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించారా అనే విషయాన్ని పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అంజుమ, తహసీల్దార్ మునిందర్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ● ఎస్పీ అశోక్ కుమార్ 8
ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి ● కలెక్టర్ సత్యప్రసాద్
ఇసుక తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత 6

ప్రభుత్వ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇచ్చేలా చొరవ చూపాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్‌లు నిజామాబాద్ ఎంపీ కార్యాలయంలో ఎంపీ అర్వింద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా తీర్పుపై సమీక్ష కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ మానవ హక్కుల అభి వృద్ధి శాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వారి వెంట జిల్లా కార్యదర్శి స్వర్ణలత, మెట్‌పల్లి మండల అధ్యక్షుడు యాదగిరి తదితరులున్నారు.

నేటి నుంచి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక ఓల్డ్ హైస్కూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 28, 29 తేదీలలోజిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రాము తెలిపారు. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ హాజరయ్యే విద్యార్థులకు భోజన వసతులతో పాటు, సైన్స్ ఎగ్జిబిట్‌లకు సంబంధించి ఏర్పాట్లు చేశామని డీఈవో రాము తెలిపారు. 28న జరిగే ప్రదర్శనలను కోరుట్ల డివిజన్‌లోని పాఠశాలలు సందర్శించవచ్చన్నారు. శనివారం జగిత్యాల డివిజన్‌లోని పాఠశాలలు సందర్శించవచ్చునని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 500మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారి రాజేష్, మల్యాల ఎంఈవో జయసింహారావు, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

●జిల్లా విద్యాశాఖ అధికారి రాము

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని డీఈవో రాము అన్నారు. ఉద్యోగ సీనియారిటీ బాధ్యతలను మరింత పెంచుతుందని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓగా రాము బాధ్యతలు చేపట్టి యేడాది పూర్తయిన సందర్భంగా ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టిన రఘువరన్

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి (ఎఫ్ఏసీ)గా డీఆర్‌డీవో రఘువరన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల జిల్లా పంచాయతీ శాఖ కార్యాలయంలో రఘువరన్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రఘువరన్‌ను డీపీఓ రేవంత్, అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, కార్యాలయ ఉద్యోగులు రాజేందర్, మురళీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా నియామకమైన జిల్లా ఎన్నికల పరిశీలకులు ఇద్దరు గురువారం కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లను కలిశారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు. జిల్లా జనరల్ అబ్జర్వర్‌గా నియామకమైన స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యూకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ జి. రమేశ్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా నియామకమైన పెద్దపల్లి జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎం.మనోహర్‌లు జగిత్యాలకు వచ్చారు. కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసిన అనంతరం అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికల వ్యయ నిర్వహణ, ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, డీపీవో (ఎఫ్ఏసీ) రఘువరన్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి, మెప్మా ఏవో దుర్గపు శ్రీనివాస్ గౌడ్, రేవంత్, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

-ఎస్పీ అశోక్‌కుమార్



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కోరుట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. గురువారం కోరుట్ల మండలంలోని అయిలాపూర్, పైడిమడుగు గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములుతో కలిసి పరిశీలించారు. అయిలాపూర్, పైడిమడుగు క్లస్టర్ పరిధిలోని గ్రామాల వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాంకు వంద మీటర్ల వరకు ఇతరులను అనుమతించవద్దని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామంలో గస్తీ పెంచాలన్నారు. నామినేషన్ స్వీకరించే గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్ఐలు చిరంజీవి, రామచంద్రుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

జగిత్యాల అర్బన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై నూకపెల్లి అర్బన్ కాలనీ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. అర్బన్ కాలనీలో నీటి కొరత ఉందని మున్సిపల్ ట్యాంకర్ ఒక్కో ఇంటికి రోజుకో డ్రమ్ము చొప్పున పోస్తున్నారని, రెండు మూడు అంతస్తుల మీద ఉన్న వారు నీటిని ఎలా మోసుకు పోతారని వారు ప్రశ్నించారు. పైప్ లైన్ చెడిపోయి 20 రోజులు దాటిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతు చేపట్టాలని కాలనీవాసులు కోరారు.

యావర్ రోడ్డు విస్తరణకు సహకారం అందించండి

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డు విస్తరణకు అవసరమైన సహకారాలు అందించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. గురువారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. జగిత్యాల పట్టణ ప్రజలకు చాలా రోజుల నుంచి యావర్ రోడ్డు ప్రధాన సమస్యగా మారిందని తెలిపారు. జగిత్యాల పట్టణానికి సంబంధించి యావర్ రోడ్డు వెడల్పు జరిగితే.. ఆస్తి నష్టపోతున్న బాధితులకు దానికి ఏ విధమైన పరిహారం ఇవ్వచ్చు అనే విషయమై ఆలోచన చేయాలని కోరారు. జగిత్యాల యావర్ రోడ్డు వెడల్పు విషయంలో చొరవ తీసుకోమని కోరారు. వెంటనే ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రితో మీటింగ్ ఏర్పాటు చేయవలసిందిగా సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వెల్లడించారు.

గుడికోట ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

రాయికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ప్రఖ్యాత గుడికోట దేవాలయాన్ని గురువారం కోరుట్ల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఆలయ విశిష్టతను పురోహితుడు సతీష్ శర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ప్రచార కార్యదర్శి బత్తిని నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రామగుండం జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేయడంతో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నియోజకవర్గానికి కోట్లరూపాయల నిధులను తీసుకువస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. రామగుండం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను నిర్మించాలని మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. దీనికోసం ముఖ్యమంత్రి, మంత్రులను కలిశానన్నారు. నేడు రామగుండం ప్రజల కలసాకారం అయ్యిందన్నారు. 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు రావడంతో పాటు రామగుండం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 7,250 రూపాయలు పలికింది. మార్కెట్ యార్డుకు బుధవారం 56 మంది రైతులు 462 క్వింటాళ్ల విడి పత్తి ఎనిమిది మంది రైతులు 11 క్వింటాళ్లు విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర 7250 రూపాయలు, కనిష్ఠ ధర 5,700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



గణేష్ (ఫైల్)

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చెరుకు గణేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. గణేష్ చదువును మానేసి స్వగ్రామం ఓదెలలోనే ఉంటున్నాడు. గత శుక్రవారం తన ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. స్నేహితులు యువకుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆరోగ్యపరిస్థితి విషమించడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అక్కడ మృతిచెందాడు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రేమవ్యవహారంగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆత్మహత్యకు ముందు ఒక పేపర్‌పై రాసి పురుగుల మందు తాగినట్లు సమాచారం. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు రాలేదని పొత్కపల్లి ఎస్ఐ తెలిపారు.





రాజన్న సన్నిధిలోని శిలా శాసనం, భీమన్న ఆలయంలో విగ్రహాలు

ప్రాచీన శిలా శాసనాలకు భద్రతేది?

పురావస్తు మ్యూజియం ఏర్పాటుకు ఎదురుచూపులు

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవస్థానంలో ఉన్న ప్రాచీన శిలా శాసనాలకు భద్రత కరువైంది. దాదాపు 1300 సంవత్సరాల క్రితం అప్పటి పాలకులైన చాళుక్యులు, కల్యాణీ చాళుక్యుల కాలంలో ఆరుకు పైగా శిలా శాసనాలు, జైన, బౌద్ధ, చౌముఖులు, నాగముచులింగ విగ్రహాలు నెలకొల్పారు. వీటితో పాటు వినియోగంలో లేని లింగాలు, వీరభద్రదేవి విగ్రహాలు భీమన్న సన్నిధిలో ఉన్నాయి. వీటి వల్ల వేములవాడ చారిత్రక ప్రాశస్త్యం తెలుసుకునే వీలుంది. ఇవేకాకుండా వందల ఏళ్ల నాటి ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, పుస్తకాలు, ఫోటోలు ఉన్నాయి. అలాగే పురాతన కాలంనాటి ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచాయతనాలు, అద్దాల మండపంలోని శిల్పాలు, స్తంభాలు ఉన్నాయి. వీటన్నింటికీ భద్రత కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రాచీన శిలా శాసనాలు, విగ్రహాలను పురవాస్తు శాఖ అధికారులు పరిశీలించి మ్యూజియంలో భద్రపరుస్తామని చెప్పారు. కానీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా పురవాస్తు మ్యూజియం ఏర్పాటు చేసి శిలా శాసనాలను భద్రపర్చాల్సిన అవసరం ఉంది.

విస్తరణలో భాగంగా మ్యూజియం నిర్మించాలి..

నాగేంద్రశర్మ, చరిత్రకారుడు

రాజన్న సన్నిధిని విస్తరిస్తున్న క్రమంలో శిలా శాసనాలు భద్రంగా ఉండడానికి అవసరమైన మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఈ విషయమై ఈవో రమాదేవి, విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించాను. ఇప్పటికైనా పురవాస్తు శాఖకు దేవస్థానం లేఖ రాసి తగిన ఏర్పాట్లు చేయాలి.

శిలా శాసనాలను పదిలంగా భద్రపరిచాం..

ఎల్. రమాదేవి, రాజన్న ఆలయ ఈవో

రాజన్న, భీమన్న ఆలయాల్లో ఉన్న పురాతన శిలా శాసనాలను, విగ్రహాలను పదిలంగా భద్రపరిచాం. ఈ విషయమై పురవాస్తు శాఖకు లేఖ రాస్తాం. తప్పకుండా శిలా శాసనాలకు మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.



నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- వేగవంతం చేయాలని రైతుల డిమాండ్



కొనుగోలు కేంద్రంలోని ధాన్యం

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 24కేంద్రాలు, ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసినా రైస్‌మిల్లులను అలాట్ చేయడం కొంత ఆలస్యం కావడంతో వల్ల ధాన్యం సేకరణ ఆలస్యం అవుతోంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి పక్షం రోజులు గడిచిపోతున్నా తూకం వేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులు మాత్రం తేమశాతం రాకపోవడం వల్లనే ఆలస్యం అవుతోందని పేర్కొంటున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కోరుతున్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు..

అన్నదాతకు తిప్పలు..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. విక్రయించేందుకు అన్నదాతలు తరలించి నెలరోజులవుతున్నా సకాలంలో తూకం వేయకపోవడంతో పడిగాపులు కాయాల్సిన వస్తోంది. ఓవైపు సాగు పనులు.. మరోవైపు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. లారీల కొరత, తూకం వేయడంలో జాప్యం వల్ల కేంద్రాల్లోనే వేచి ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



వీర్నపల్లిలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

పిచ్చి కుక్క స్వైరవిహారం

- ఐదుగురికి గాయాలు

పెగడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం ఉదయం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. మోడల్ స్కూల్ పరిసరాల్లో ఐదుగురిని కరిచి తీవ్రంగా గాయపరచగా ఇద్దరు జగిత్యాల ఆస్పత్రిలో చేరారు. గ్రామానికి చెందిన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్, కొత్తూరి సాయిలు, వద్లూరి రాజవ్వ, రంగారావులను కరువగా తీవ్రగాయాలైన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్‌లను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన బాలె మల్లీశ్వరి (38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లీశ్వరి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెందిన మల్లీశ్వరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త బాలె గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ఆరు టిప్పర్ల పట్టివేత

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ఆరెపల్లి శివారులో బుధవారం అర్ధరాత్రి ఆరు ఇసుక టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పక్కా సమాచారం మేరకు ధర్మపురి తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నిఘా వేసి ఆరు టిప్పర్లను పట్టుకున్నారు. అనంతరం ఐదు ఇసుక టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు, ఒక ఇసుక టిప్పర్‌ను మండల రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ఇసుక విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్ఐ భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.మహేష్ తెలిపారు.

● పోలీసుల కళ్లు గప్పి ఇసుక తరలింపు

ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, ధర్మపురి గోదావరి



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక టిప్పర్లు

నది నుంచి కొంతకాలంగా అక్రమార్కులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అనంతరం జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం ప్రధాన రహదారుల గుండా కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రోజుకు లక్షలు రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా విషయమై పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వివిపిస్తున్నాయి.

ఇసుక డంప్‌ల స్వాధీనం..

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన, గంభీర్‌పూర్, తక్కళ్ళపల్లి గ్రామాల రోడ్ల వెంట నిల్వ ఉంచిన ఇసుక డంపులను పట్టుకున్నామని ఆర్ఐ రవీంధర్ తెలిపారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు చేశామని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎండీ అమీర్‌ఖాన్(18) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. హుస్సేనిపురకు చెందిన అమీర్‌ఖాన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు పనిముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు.

గాంధీ చౌరస్తా నుంచి నాకా చౌరస్తా దారిలో బైక్‌ను వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అమీర్‌ఖాన్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న శంకరపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో అక్రమంగా నిలువ ఉంచిన రూ.15 వేల మద్యం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ మద్యం నిలువ, రవాణాపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గురువారం అందిన సమాచారంతో దుర్శేడ్ గ్రామంలో ఊర్మిళ నివాసంలో తనిఖీ చేయగా మద్యం పట్టుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం కన్నాపూర్, లింగాపూర్‌లో కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం బెల్ట్ షాపులపై దాడి చేశారు. అక్రమంగా నిలువ చేసిన మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన పంజాల రమేష్, పంజాల సత్యనారాయణ, లింగాపూర్‌కు చెందిన పచ్చిమట్ల నారాయణ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడి చేసినట్లు, వారి వద్ద నుంచి సుమారు 21,000 రూపాయల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వీణవంక: వీణవంక మండలం రెడ్డిపల్లిలో సుమన్ బెల్ట్ షాప్‌పై పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 8,760 రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చందుర్తి: రెండు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.12,395 విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై ఆనంద్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని జోగాపూర్ కిష్టంపేట గ్రామాల్లోని రెండు ఇళ్లలో అక్రమంగా మద్యాన్ని నిల్వచేసినట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో జోగాపూర్‌లో గడ్డం అంజయ్య ఇంట్లో 6,725 రూపాయల విలువగల మద్యాన్ని, కిష్టంపేటలో వాంకే అనిత ఇంట్లో 5,670 రూపాయల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గడ్డం అంజయ్యతో పాటు వాంకే అనితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9న ఆదిలాబాద్‌కు చెందిన సిద్ధార్థ పవర్ తన సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ మహబూబాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్ యజమానిని గురువారం కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌కు పిలిపించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు. ఫోన్ రికవరీకి కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్‌హౌజింగ్ కాలనీకి చెందిన తునికి ప్రమీళ అనే వృద్ధురాలు బుధవారం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ప్రమీళ ఇంటికి తిరిగి రాలేదని పలు చోట్ల వెదికిన ఆచూకీ లభించలేదని పేర్కొనగా వృద్ధురాలి కొడుకు నరేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓదెల-కొలనూర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కన గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి వయసు 30-35 మధ్య ఉంటుందని, గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి పడి మృతి చెంది ఉంటాడని రైల్వే అధికారులు భావిస్తున్నారు. మృతుడు బ్లూ ఫుల్ టీషర్టు, దానిపై తెలుపు డిజైన్, స్కై బ్లూకలర్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి తిరుమల తిరుపతి వెళ్లే టిక్కెట్ లభించింది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, వస్తువులు లేవు. మృతదేహాన్ని రామగుండంలోని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. వివరాలు తెలిస్తే 9949304575 నంబర్‌కు తెలపాలని కోరారు.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపుల నిర్వాహకులు, పాత నేరస్థులు 13 మందితోపాటు సస్పెక్ట్ షీటర్స్, కమ్యూనల్ షీటర్స్ 15 మందిని గురువారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 28 మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరచినట్లు, నేర ఘటనలు, అక్రమ దందాలకు పాల్పడకుండా లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు వివరించారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్, మొగ్దుంపూర్, చామనపల్లి, చెర్లబూత్కూర్, చేగుర్తిలోని నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపు నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులను తహసీల్దార్ ముక్తర్‌పాషా ఎదుట హాజరుపరిచామని పోలీసులు గురువారం తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మద్యం అనుబంధ దుకాణాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులు క్రమశిక్షణతో నడచుకోవాలని సూచించారు.

మాజీ మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మ దహనం



హరీష్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఏర్పాటు చేయనున్న 800మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌పై మాజీమంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మహంకాళిస్వామి, గట్ల రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రామగుండానికి ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాకపోగా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. జెన్‌కో స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటుతో ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. కానీ ఎన్‌టీపీసీ, జెన్‌కో బిడ్డింగ్‌పై హరీష్‌రావు అవగాహన లేకుండా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, కౌటం సతీష్, గడ్డం శ్రీనివాస్, పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం నవంబరు 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అంబేద్కర్ చౌక్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కేసీఆర్ నిరాహార దీక్ష ముఖ్య ఘట్టమని అన్నారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కల రామారావు, టెక్స్‌టైల్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అవసరాలకు ఇండోర్ సబ్‌స్టేషన్

- నిరంతర సరఫరాకు ముందస్తు ప్రణాళికలు
- రూ.4.5 కోట్లతో కరీంనగర్‌లో ఏర్పాటు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడానికి టీజీ ఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపులే పార్కులో ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.వేసవి కాలంలో ఓవర్‌లోడ్, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుంది.

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం..

మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



భవిష్యత్తులో విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నాం. 12 అడుగుల ప్రహరీ నిర్మిస్తున్నాం.. ఈ సబ్‌స్టేషన్‌తో పలు ప్రాంతాలకు లోవోల్టేజీ సమస్యలు తీరుతాయి.

ప్రయోజనాలు

ఇండోర్ సబ్ స్టేషన్‌ను నాలుగు గుంటల స్థలంలో నిర్మించవచ్చు. సంప్రదాయ అవుట్ డోర్ సబ్ స్టేషన్ సుమారు 20 గుంటల నుంచి ఎకరం వరకు స్థలం అవసరం ఉంటుంది. ఇండోర్ సబ్‌స్టేషన్‌తో లోవోల్టేజీ సమస్యలను తగ్గించవచ్చు. లైన్ పొడవు తక్కువ ఉండడం వల్ల విద్యుత్ అంతరాయాలను నివారించవచ్చు. కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపులే పార్కులో ఏర్పాటు చేస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ముకరంపుర, బస్టాండ్, గీతాభవన్, ఐబీ చౌరస్తా, జ్యోతినగర్, సంతోష్‌నగర్ ప్రాంతాలు వస్తాయి. ఈ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 15 మెగావాట్ల లోడ్ అవసరం అవుతుంది. భవిష్యత్తులో విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరిగేకొద్దీ లోడ్ పెరుగుతుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి సారి కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు.



కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే పార్కులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

మల్లెగుట్ట మల్లన్నకు నాగవెల్లి పట్నం


మల్యాల నుంచి బోనాలతో వెళ్తున్న భక్తులు

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల శివారులో గల మల్లెగుట్ట మల్లన్న సన్నిధి షష్ఠి దండి వారం సందర్భంగా సందడిగా మారింది. బుధవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గుట్టపైకి చేరుకోగా ఒగ్గు పూజారులు మల్లన్నకు కల్యాణం నిర్వహించారు. కాగా గురువారం భక్తులు బోనాలతో వెళ్లి స్వామి వారికి సమర్పించగా నాగవెల్లి పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దండి ఏడు వారాల పాటు ఇక్కడ పూజలు జరగనుండగా వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాలు ప్రారంభం


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే గల దత్తాత్రేయస్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ వంశపారంపర్య అర్చకులు ద్యారం గిరిప్రసాద్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు కలశ పూజ, రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తంతో అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్య-నరేందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమ్మేళనానికి నర్సింహులపల్లి విద్యార్థులు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వారు నిర్వహించే అంతర్జాతీయ శతాధిక బాలరచయితల సమ్మేళనానికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి జిల్లాపరిషత్ విద్యార్థులు ఎంపికయ్యారు. నవంబరు 30న, తానా ప్రపంచ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో 13గంటల పాటు నిర్విరామంగా బాలసాహిత్య భేరి కార్యక్రమం నిర్వహిస్తారు. కథ, గేయం, వచన కవిత, పద్యం విభాగా ల్లో పోటీలు జరుగుతుండగా ప్రపంచ వ్యాప్తంగా 101మంది విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో నర్సింహులపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గంగారపు శృతి, దారవేణి అశిత, అలిశెట్టి రాహుల్, సింగం శశాంత్, గన్మకుల లవన్‌కుమార్ కథ, వచనకథ విభాగాల్లో జూమ్ వేదిక ద్వారా పాల్గొననున్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి రామచంద్రారెడ్డి, కందుకూరి భాస్కర్ అభినందించారు.


అంతర్జాతీయ కథల సమ్మేళనానికి ఎంపికైన విద్యార్థులు


యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నమూనా

ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి

రుక్మాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్

రూ. 200 కోట్లతో స్కూల్ ఏర్పాటు

రుక్మాపూర్‌లో నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 200 కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. స్కూల్ కోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. స్కూల్‌లో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్కూల్‌ను నిర్వహిస్తారు. నాణ్యమైన విద్యను అందించి ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా తీర్చిదిద్దుతారు.

చొప్పదండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి మారుతోంది. జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో మరో ప్రతిష్ఠాత్మకమైన విద్యాలయం ఏర్పాటు కానుంది. నియోజక వర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం చొప్పదండి మండలంలోనే ప్రతిపాదించగా ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలో నెలకొనగా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ మొట్ట మొదటి సైనిక్ స్కూల్‌ను రుక్మాపూర్‌లోనే నెలకొల్పారు. తాజాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో 25 ఎకరాలను కేటాయించారు.

సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఒక స్కూల్‌ను మంజూరు చేయగా, సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సమ్మిళిత విద్య, సమానత్వ సమాజాన్ని నిర్మించే ముఖ్య లక్ష్యాలతో స్కూల్‌ను రూపొందించారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో కుల, మత బేధం లేని వాతావరణం ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలతో సమగ్ర నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి ఏకీకృత విద్యార్థి సంఘాన్ని సృష్టించి సామాజిక విభజనలను తొలగించడం కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

చొప్పదండి కేంద్రంగా విద్యాలయాలు

చొప్పదండిలో ఇప్పటికే నవోదయ విద్యాలయం, సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్ ఉండడంతో తాజాగా అత్యుత్తమ స్కూల్‌గా అవతరించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రావడంతో చొప్పదండి మండలం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనుంది. దేశ రక్షణ రంగాల్లో చేరేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సైనిక్ స్కూల్ ఉండగా, కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలోనే ఉండడం విశేషం. మండలంలోని రుక్మాపూర్‌లో సైనిక్ స్కూల్, మోడల్ స్కూల్, కస్తూరిబా విద్యాలయాలు ఉండగా, ఇక్కడే యంగ్ ఇండి యా స్కూల్ ఏర్పాటు కానుండం విశేషం. రుక్మాపూర్‌లో నాలుగు ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు కావడం విశేషం.



చొప్పదండిలోని నవోదయ విద్యాలయం


రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్

ఎస్‌యూలో ప్రశాంతంగా యూజీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 3,5వ సెమిస్టర్ పరీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ 5వ సెమిస్టర్ పరీక్షలకు 2,619 మంది విద్యార్థులకు 2,497 మంది హాజరైనట్లు తెలిపారు. నలుగురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 10,991 మంది విద్యార్థులకు 10,579 మంది హాజరైనట్లు తెలిపారు. ఇద్దరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు వెల్లడించారు.

ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న విశ్వవిద్యాలయ, అనుబంధ కళాశాలలకు ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరిక్ష ఫీజు షెడ్యూల్ గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబరులో ఉంటాయని పేర్కొన్నారు. డిసెంబరు 5వ తేదీలోగా పరీక్షలు ఫీజు చెల్లించాలని తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 9 వరకు అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి 1,338 క్యూసెక్కుల వరద

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు


లీగ్ పోటీల్లో తలపడుతున్న హైదరాబాద్-మెదక్ జట్లు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అండర్14 విభాగంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరిగా జరుగుతున్నాయి. మండలం లోని నందిమేడారం లోని బాలుర గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఈపోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి 240మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 10 జిల్లాల జట్లను ఏ-పూల్ 5జట్లను, బీ-పూల్‌గా 5జట్లను విభజించారు. బుధవారం పోటీలు ప్రారంభం కాగా మొదటి రెండు రోజులు బాలబాలికల జట్ల మధ్య 40లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. గురువారం జరిగిన లీగ్‌మ్యాచ్‌లో గెలుపొందిన టీమ్‌లు బాలుర విభాగం నుంచి 4టీమ్‌లు, బాలికల విభాగం నుంచి 4టీమ్‌లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. నేడు ఉదయం జరిగే సెమీఫైనల్ పోటీల్లో గెలుపొందిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటుండగా మధ్యహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్‌లతో పోటీలు ముగియనున్నాయి.

భీమన్న సేవలో చేరిన ఎస్‌పీఎఫ్ పోలీసులు

- బందోబస్తు పరిశీలించిన కమాండెంట్ జంగయ్య

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమేశ్వరాలయంలో ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది విధుల్లో చేరింది. గురువారం ఆలయంలో భద్రతను ఎస్‌పిఎఫ్ కమాండెంట్ జంగయ్య, ఆలయ ఈవో రమాదేవి పరిశీలించారు. అనంతరం కమాండెంట్, ఈవోలు భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు హెడ్‌కా నిస్టేబుల్స్, 10మంది కానిస్టేబుళ్లకు భీమన్న సన్నిధిలో విధులు కేటాయించామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వ కంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన భద్రతా సిబ్బంది స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు డి.తిరుపతి రెడ్డి, మహేందర్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, గొట్టం గిరిలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ అమలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఉద్యోగులకు బయోమెట్రిక్ అమల్లోకి తీసుకువచ్చారు. గురువారం భీమేశ్వర సదన్‌లోని ఈవో కార్యాలయంలో నెలకొల్పిన బయోమెట్రిక్ విధానంలో హాజరును ఈవో రమాదేవి పరిశీలించారు. ఆలయంలో దాదాపు 150మంది మినిస్ట్రీరియల్, నాలుగో తరగతి ఉద్యోగులు, మరో 20 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 150మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. ఇకనుంచి రాజరాజేశ్వ రాలయం, భీమేశ్వరాలయంలో పనిచేసే ఉద్యోగులందరికి బయోమెట్రిక్ యంత్రం ద్వారా హాజరు చేసుకునే పద్ధతి అమలులోకి తీసుకువచ్చారు.



విధుల్లో చేరిన ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఈవో రమాదేవి, బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలిస్తున్న ఈవో

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అప్పన్నపేట విద్యార్థి ఎంపిక


అశ్వితను అభినందిస్తున్న హెచ్‌ఎం పురుషోత్తం

పెద్దపల్లి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో ఎంపికకి మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్‌పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పంబాల అశ్విత ఎంపికైనట్లు పీడీ సురేందర్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు విద్యార్థిని ని అభినందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో ఈనెల 28నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలలో అశ్విత పాల్గొంటున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి రూ. ఐదు వేల కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ

సుభాష్‌నగర్/భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఐదు వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్య కార్మికుల నాలుగో రాష్ట్ర మహాసభ, ముకుందలాల్ మిశ్రా భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మత్స్య సొసైటీకి పది లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికి మత్స్య వృత్తిపై ఆధారపడి కుటుంబాలు ఉపాధి పొందుతున్నా యన్నారు. రాష్ట్రంలో సుమారు 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో ఐదు లక్షల 60 వేల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నార న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మాఫియా పెద్ద ఎత్తున చెరువులు కుంటలు జల వనరుల ఉనదీ పరి వాహక ప్రాంతాల భూములను కబ్జాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూములను శాటిలైట్ ద్వారా సర్వే చేయించి పూడికలు తీయించి ఫెన్సింగ్ వే యాలన్నారు. జనవనరులను కబ్జాలు కాలుష్యం నుంచి విముక్తి కల్పించి మత్స్య వృత్తిని కాపాడాలన్నారు. గత ప్రభుత్వంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు.

మత్స్యకార సొసైటీ అకౌంట్‌లో నగదు జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ రుణాలు నిలిపివేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీడీ రుణాలను మత్స్య సహకార సంఘాలకు నేరుగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంక్షేమ ఫలితాలను పారదర్శకతతో అవినీతి లేకుండా అమలు చేయాలని కోరారు. 33 జిల్లాల మత్స్య సహకార సంఘాల ఎన్నికలు నిర్వ హించాలని, డిమాండ్ చేశారు. సమావే శంలో రాష్ట్ర అధ్యక్షుడు గొరింకల నరసిం హ, ఉపాధ్యక్షుడు పగడాల నాగేశ్వరరావు, దీటి శ్రీనివాసరావు, గాండ్ల అమరావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, భక్కి బాలమణి, చంద్రి పుష్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టల వెంకటేష్, జునగరి గణేష్, కోశాధికారి పప్పు సదానంద, నగర అధ్యక్ష, కార్యదర్శులు మద్రి శశికళ, నాగుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ...

ఈ సందర్భంగా తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోరెంకల నర్సింహా, లెల్లెల బాలకృష్ణ, 19 మంది ఆఫీస్ బేరర్స్, 51 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నాడు ఎన్నికలకు దూరం.. నేడు సై..

- తీరిన గొల్లపల్లి వాసుల సమస్య..
- ఎన్నికలకు సిద్ధం అవుతున్న ప్రజలు
- ఏడు సంవత్సరాలుగా ప్రత్యేకాధికారుల పాలన


గొల్లపల్లి గ్రామం

ఇల్లంతకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చేసిన పొరపాటు వల్ల ఆగ్రామపంచాయితీకి పాలకవర్గం లేకుండా పోయింది. ఇల్లంతకుంట మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రభుత్వం రెండు గ్రామపంచాయతీలుగా మార్చింది. వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయితీలుగా ఆవిర్భావం చెందాయి. అప్పటి అధికారులు గొల్లపల్లికి చెందిన 150మంది ఓటర్లతో పాటు ఇళ్లు, వ్యవసాయ భూములను వెంకట్రావుపల్లె పరిధిలోకి వచ్చేలా చేశారు. దీనిపై గొల్లపల్లి గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. 2019 జనవరిలో ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. గొల్లపల్లి గ్రామపంచాయతీని బీసీకి కేటాయించారు. తమ ఓటర్లను తమ గ్రామపంచాయతీలో కలిపితేనే ఎన్నికలకు వెళతామని గొల్లపల్లి గ్రామస్థులు పట్టుబట్టారు. దీనితో సర్పంచ్, వార్డుస్థానాలకు ఎవరు నామినేషన్లు వేయలేదు. ఎన్నికలు జరగకుండా పోయాయి. అనంతరం ఫిబ్రవరిలో మరోసారి గొల్లపల్లి గ్రామపంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లాస్థాయి అధికారులు గ్రామానికి చేరుకొని నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది చేత నామినేషన్లు వేసేలా ప్రోత్సహించారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు మరోసారి ఏకమైన గ్రామస్థులు అందరు ఉపసంహరించుకున్నారు. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గొల్లపల్లి గ్రామపంచాయతీ కొనసాగింది.

ఓటర్లను గ్రామంలో కలపడంతో..

చివరకు ప్రభుత్వం గ్రామానికి చెందిన ఓటర్లను తిరిగి గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారు. దీనితో ఈసారి ఎన్నికలకు గొల్లపల్లి గ్రామపంచాయతీ సిద్ధం అవుతోంది. గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చింతలకుంటపల్లె గ్రామం కూడా వస్తుంది. గ్రామపంచాయతీలో ప్రస్తుతం 324మంది పురుష, 298మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 622మంది ఓటర్లు ఉన్న గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రస్తుతం ఎస్సీ మహిళకు కేటాయించారు. ఈనెల 14న జరిగే ఎన్నికల బరిలో నిలిచేందుకు గ్రామస్థులు సిద్ధం అవుతున్నారు. తమ సమస్య పరిష్కారం కావడంతో ఎన్నికలకు వెళ్తున్నామని పేర్కొంటున్నారు.

రుద్రంగి మండలంలో... నాలుగు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం


వీరునితండాలో సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్థులు

రుద్రంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలంలో ఇప్పటివరకు నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల, వార్డుసభ్యులు నామినేషన్ల ప్రక్రియ జరుగుతోంది. గురువా రం ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. మండలంలోని గైదిగుట్ట తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోత్ మంజుల, చింతమణితండా సర్పంచ్‌గా గుగులోత్ సిందూజ ఏకగ్రీవం అయ్యారు. రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

వాలీబాల్ పోటీల ఏర్పాట్లు పరిశీలన

సిరిసిల్ల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీల ఏర్పాట్లను కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బాలురు 10 జట్లు, బాలికలు 10 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 3 వరకు ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షు డు శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాం, కోశాధికారి కోడం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ అకాడమి కోచ్‌లు పాల్గొన్నారు.


వాలీబాల్ కోర్టును పరిశీలిస్తున్న లక్ష్మణ్ , సభ్యులు

ఘనంగా అయ్యప్ప పడి పూజ

జగిత్యాల అర్బన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ హర హర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ స్వామి వారి మహా పడి పూజ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ అయ్యప్ప గురు స్వాములు నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్, లక్ష్మీపతి ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌లు నిర్వహించిన ఈ పడిపూజ మహోత్సవం సందర్భంగా శ్రీ స్వామి వారిని స్మరిస్తు 18 మెట్లకు పూజలు చేశారు. అనంతరం పడిపూజా మహోత్సవానికి తరలి వచ్చిన భక్తులకు శ్రీస్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. పడిపూజ సందర్భంగా ఆలయ పరిసరాలు అయ్యప్ప దీక్షా స్వాములు చేసిన ధరణు గోశతో మారు మ్రోగాయి. ఈ కార్యక్రమంలో అడువాల శ్రీనివాస్ 28 వ గురు స్వామి, సాయి మణి కన్నె స్వామి పట్టణంలోని అయ్యప్ప దీక్షా స్వాములు పాల్గొన్నారు.

వందేమాతరం గీతాలాపాన

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయం 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత్ సురక్షాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక గీతా విద్యాలయంలో విద్యార్థులచే వందే మాతర గీతాలాపాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, సంఘ బాధ్యులు హాజరై, విద్యార్థులతో కలిసి గీతాలాపాన చేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు కాశీనాథం, గంగాధర్, పోచమల్లు, అరవలక్ష్మీ, చిట్ల గంగాధర్, శ్రీనివాస్, భూమన్న, బాలన్న పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో గల శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నచికేత్, విఘ్నేష్, రహ్మతుల్లాలు ఈనెల 22న జాబితాపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు ఆదిలాబాద్‌లోని ఇచ్చోడలో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముసిపట్ల రాజేంధర్ తెలిపారు.

ఏడీఈకి సన్మానం

మెట్‌పల్లి టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఏడీఈగా పదోన్నతి పొందిన తిప్పాజి రవిని గురువారం పట్టణంలోని 23వ వార్డు మాజీ కౌన్సిలర్ ఒజ్జల బుచ్చిరెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ లైన్‌మెన్ సంజీవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఒజ్జల శ్రీనివాస్, సురేందర్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలని వినతి

రాయికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాజీ రెడ్డి ఫంక్షన్ హాల్‌కు సీసీ రోడ్డు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు రాయికల్ పట్టణ శివాజీ రైతు యువజన సంఘం సభ్యులు వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జిల్లాల మల్లారెడ్డి, కోశాధికారి కడపటి రాజేందర్, కార్యవర్గ సభ్యులు దమ్మ గంగారెడ్డి, జిల్లాల గంగారెడ్డి, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని, దీని వలన భవిషత్తు నాశనం అవుతుందని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళశాలలో గురువారం వైద్య విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై పోలీస్ శాఖ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. స్నేహపూర్వక వాతావర ణంలో చదువుకోవాలని సూచించారు. సీనియర్లు జూనియర్లను ప్రోత్సహించి మార్గనిర్దేశనం చేయాలని, భయపెట్టడం లాంటి చర్యలు చేయకూడదని అన్నారు. ర్యాగింగ్ వల్ల బాధితుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గతంలో ర్యాగింగ్ కారణంగా అనేక మంది విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ర్యాగింగ్ లో పాల్గొనే విద్యార్థులపై క్రిమినల్ కేసులు, జైలు శిక్ష, కళశాల నుంచి బహిష్కరణ, స్కాలర్‌షిప్ రద్దు, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం వంటి తీవ్ర శిక్షలు ఉంటాయని తెలిపారు. ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడితే 100 నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని, కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను బలపరచాలని అధ్యాపకులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. అనంతరం ఎస్పీ యాంటి ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులతో యాంటి ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, హెచ్ఓడి కాద్రి, అధ్యాపకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



సీఏల అవగాహన కార్యక్రమానికి హాజరైన ఫోరం ప్రతినిధులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని చార్టెడ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా కరీంనగర్ శాఖ వైస్ చైర్మన్ వి.శేఖర్‌రెడ్డి అన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ కోర్సు ఎవర్‌గ్రీన్ కోర్సుఅని, రానున్న రోజుల్లో ఈ కోర్సుకు డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని అన్నారు. జగిత్యాల జిల్లా కామర్స్ అధ్యాపకులు అందరూ జిల్లా కామర్స్ ఫోరం తరుపున గురువారం జగిత్యాలలోని పలు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడిసిన్, కాకుండా కామర్స్ విద్యపై ప్రధానంగా చార్టెడ్ అకౌంటెన్సీ కోర్సుపై ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్స్‌తో విద్యార్థులకు సీఏ కోర్సుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చార్టెడ్ అకౌంటెన్సీ కోర్సు చదవడానికి పట్టే సమయం, అయ్యే ఖర్చు, తరగతుల నిర్వహణ, చదవాల్సిన విధానం, పరీక్షలకు చెందిన వివరాలు , జీవితంలో ఎంతో ఉన్నతంగా స్థిరపడవచ్చువని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చార్టెడ్ అకౌంటెంట్‌లు సమాధానాలు ఇచ్చి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఏ ఆఫ్ ఇండియా కరీంనగర్ శాఖ సెక్రెటరీ బెక్కంటి అజయ్, సీఏ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గందె శ్రీనివాస్, మాజీ సెక్రెటరీ వెన్న శ్యాంసుందర్, మల్లేశం, శివకుమార్, శ్యాంసుందర్, జగిత్యాల కామర్స్ ఫోరం కన్వీనర్, నలంద కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, శ్రీచైతన్య కళాశాల కరస్పాండెంట్ ముసిపట్ల రాజేందర్‌తో పాటు జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, ఆక్స్‌ఫర్డ్, శ్రీనిధి, ప్రతిభ పాఠశాలలు, ఎస్ఎస్‌వి, నవ్య జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని న్యూ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈవో మాన్య రాజయ్య-రాధ దంపతులు ఐడీ కార్డులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకతార, బుగ్గారపు హరీష్, రొట్టె సరిత, మాన్య సునీత, మ్యాన పవన్‌కుమార్ అంగవాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామానికి స్థలం కేటాయింపు

పెగడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :పెగడపల్లి మండలంలోని వెంగళాయి పేటలో వైకుంఠదామం నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తహసీల్దార్ ఆనంద్ కుమార్ గురువారం తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామ సమీపంలోని పెగడపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 47లో 20 గుంటల స్థలం కేటాయించినట్లు తెలిపారు.

క్లస్టర్ల వారీగా నామినేషన్ కేంద్రాల ఏర్పాటు

రాయికల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రానున్న సర్పంచ్ ఎన్నికలకుగాను క్లస్టర్లవారీగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాయికల్ ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. క్లస్టర్-1 పరిధిలోని అల్లీపూర్, కిష్టంపేట, కుర్మపల్లి, సింగరావుపేట, శ్రీరాంనగర్ గ్రామాలకు అల్లీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, క్లస్టర్-2 పరిధిలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాలకు ఉప్పుమడుగు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నామినేషన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అలాగే క్లస్టర్-3 పరిధిలోని ఆలూరు, రాజనగర్, వీరాపూర్ గ్రామాలకు ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం, క్లస్టర్-4 పరిధిలోని ఆల్యనాయక్ తండా, ధర్మాజీపేట, కైరిగూడెం, తాట్లవాయి గ్రామాలకు తాట్లవాయి గ్రామ పంచా యతీ కార్యాలయం, క్లస్టర్-5 పరిధిలోని దావన్‌పెల్లి, కట్కాపూర్, వస్తాపూర్ గ్రామాలకు కట్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

క్లస్టర్-6 పరిధిలోని బోర్నపెల్లి, చింతలూరు, మంక్యానాయక్ తండా, ఒడ్డెలింగాపూర్ గ్రామాలకు ఒడ్డెలింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, క్లస్టర్-7 పరిధిలోని జగన్నాథ్‌పూర్, కొత్తపేట, మూటపెల్లి, ఒడ్డెర కాలనీ గ్రామాలకు కొత్తపేట నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపిక చేశారు. క్లస్టర్-8 పరిధిలోని ఇటిక్యాల, రామారావుపల్లి గ్రామాలకు ఇటిక్యాల పాత గ్రామ పంచాయతీ కార్యాలయం, క్లస్టర్-9 పరిధిలోని చెర్లకొండాపూర్, కుమ్మరిపెల్లి, మైతాపూర్ గ్రామాలకు మైతాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, క్లస్టర్-10 పరిధిలోని భూపతిపూర్, రామాజీపేట గ్రామాలకు భూపతిపూర్ గ్రామ పంచాయతీ భవనాలను ఎంపిక చేశారు.

●**మల్యాల:** మల్యాల మండలంలోని 19 గ్రామపంచాయితీలు, 186 వార్డు సభ్యుల స్థానాలకు తలపడే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల కోసం ఆరు చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. రాంపూర్‌లో రాంపూర్, ఒబులాపూర్, మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లె, రామన్నపేటలో రామన్నపేట, నూకపల్లి, పోతారం, రాజారం, తాటిపల్లిలో తాటిపల్లి, సర్వాపూర్, బల్వంతాపూర్, మల్యాలలో మల్యాల, ముత్యంపేటలో గుడిపేట, ముత్యంపేట, తక్కల్లపల్లిలో తక్కళ్లపల్లి, లంబాడిపల్లి, మ్యాడంపల్లి, మానాలకు చెందిన వారు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఈనెల 30 నుంచి నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలో ఏడు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో ఇ. స్వరూప గురువారం తెలిపారు.

●తిర్మాలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో దమ్మయ్యపేట, గంగారాంతండా, కోనాపూర్, సూరంపేట, తిర్మాలాపూర్ గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

●నాచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డబ్బుతిమ్మయ్యపల్లి, హిమ్మతురావుపేట, నాచుపల్లి, రాంసాగర్, శనివారంపేట గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

● కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చింతల్లపల్లి, కొండాపూర్, రామకిష్టాపూర్ గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

●తిప్పయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెప్యాల, నల్లగొండ, తిప్పయ్యపల్లి గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

●నమిలికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నమిలికొండ, శ్రీరాములపల్లి, తురుకకాశీనగర్ గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

●పూడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అప్పారావుపేట, గౌరాపూర్, నర్సింహులపల్లి, పూడూర్ గ్రామాల సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు. కొడిమ్యాలలో కొడిమ్యాల గ్రామ సర్పంచు అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను అందించాలన్నారు.

పల్లె పోరు షురూ..!

(ఐదో పేజీ తరువాయి)

గెలిచి జిల్లాలో పట్టు పెంచుకునేందుకు బలమైన అభ్యర్థులను పోటీలో దింపేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. ప్రజాబలంతో పాటు ఆర్థికంగా ఖర్చును తట్టుకునే అభ్యర్థులను రంగం లోకి దింపి పోటీ చేయించి, వీలైనన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని సిద్ధమయ్యారు.

●బంధువులను బరిలో నిలిపేందుకు నాయకుల ఆరాటం

గ్రామాల్లో సర్పంచ్‌గా ఎన్నిక కావాలని ఆశపడుతున్న నాయకులంతా ఈసారి తమ అదృష్టాన్ని పరిరక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో స్థానానికి కనీసం ఐదు కంటే అధికంగానే నామినేషన్ల దాఖలయ్యే అవకాశాలున్నాయి. జనరల్ స్థానాలతో పాటు మహిళా ఎస్సీ, ఎస్టీ స్థానాల్లోనూ బరిలోకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. తమకు కలిసి రాని చోట తమ సతీమణులు, కుటుంబ సభ్యులను పోటీలోకి నిలబెడుతున్నారు. పరిషత్ ఎన్నికల్లో రిజరేషన్లు కలిసి వస్తాయో..రావో మరోవైపు పార్టీ గుర్తు కావడంతో బీఫాం ఇస్తారో.. లేదో అనే ముందస్తు వ్యూహంతో మొదట సర్పంచ్ స్థానానికి పోటీ చేసి తమ బలాన్ని తెలుసుకునేందుకు ఆరాట పడుతున్నారు. ఇందుకోసం అన్ని వనరులు సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఎన్నికల ఖర్చు కోసం ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

జగిత్యాల అర్బన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సిఐటియు రాష్ట్ర కమిటీలో జగిత్యాల జిల్లాకు చెందిన పలువురికి చోటు కల్పించినట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మల్యాల మండలం తక్కళ్ళపెల్లి గ్రామానికి చెందిన ఏ రజిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జగిత్యాల పట్టణానికి చెందిన గుగ్గిళ్ళ స్వప్న, పెగడపెల్లి మండలం ల్యాగలమర్రికి చెందిన జయప్రదలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జగిత్యాల అర్బన్ ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, ప్రధానరాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఇఓ చంద్రకళ, ఏఇ వినయ్, బీఆర్ఎస్ నాయకులు టి.గంగాధర్, కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల గంగాధర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్‌లో నిర్వహించిన అండర్ 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో జగిత్యాల శ్రీచైతన్య హైస్కూల్ సీబీఎస్ఇ జాబితాపూర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అమూల్య ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అమూల్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సైతం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పూర్ణచందర్, పీఈటీలు ప్రశాంత్, వెంకటేష్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మేడిపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రలో పాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. రైతుల నుండి ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అంజుమ, తహసీల్దార్ మునిందర్, సీఈవో బొందయ్య, నిర్వహకులు రాజశేఖర్, లక్ష్మినారాయణ, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుల పోషణ బాధ్యత వారసులదే

జగిత్యాల అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను నిరాధరిస్తున్న కొడుకులు, కోడళ్ళకు తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్స్ కేంద్ర కార్యాలయంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వృద్ధులు చేసిన పిర్యాదులపై వారి కొడుకులను కోడళ్ళను పిలిపించి వృద్ధ తల్లిదండ్రులను, అత్తమామలను పోషించకుండా నిరాధరణకు గురి చేస్తే వయో వృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్, ఆర్డీఓ జైలు శిక్షతో పాటు తల్లి దండ్రుల ఆస్తులను తిరిగి స్వాదీనం చేసుకుంటారని వారికి నచ్చజెప్పారు. అనంతరం వారు ఒప్పంద పత్రాలు రాసిచ్చి తల్లిదండ్రులను వెంట తీసుకెళ్ళారు, ఈ కౌన్సిలింగ్‌లో సీనియర్ సిటీజన్స్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, ఇంద్రయ్య, కరుణ లు పాల్గొన్నారు.

'అందరూ రక్తదానం చేయాలి'

బీర్‌పూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రక్తం దానం చేసే దాతలు ముందుకు రావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్ అన్నారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గురువారం ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు హేమంత్ మాట్లాడుతూ రోగులకు రక్తం దొరకకా చాల మంది చాల మంది రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని రక్తం దానం చేసే దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేటి రక్తదాతలే రేపటి ప్రాణదాతలని కొనియాడారు. గ్రామంలోని పద్మశాలి సంఘం భవణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 34 మంది తుంగూర్ గ్రామ యువకులు ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, ద్యావనపెల్లి జలేందర్, వొద్దిపర్తి మధుకుమార్, ఆడెపు రమేష్, మిట్టపెల్లి శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముగిసిన టెండర్

కొడిమ్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోని హాల్‌లో గురువారం 2026 సంవత్సరం జాతరకు(బ్రహ్మోత్సవాలు) సంబంధించి నిర్వహించిన కొబ్బరి ముక్కల సేకరణ టెండర్ ముగిసింది. కొబ్బరి ముక్కల సేకరణ టెండర్‌ను రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన జెట్టి కొమురయ్య 91వేల రూపాయలకు టెండర్ దక్కించుకున్నట్లు ఈవో వెంకన్న తెలిపారు. గత టెండర్ కన్న 46 వేల రూపాయలు ఎక్కువగా ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. పట్టెనామాలు, కోరమీసాలు టెండర్‌కు సరైన పాటదారు రానందున వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. ఈ టెండర్‌లో ఆలయ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ బలపరిచే సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని నియోజకవర్గ స్థానిక ఎన్నికల ఇన్‌చార్జీ వాసాల రమేశ్ కోరారు. మల్యాలలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర నిధులు మళ్లీ పోతాయనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుందని, ప్రజలపై ప్రేమతో కాదని విమర్శించారు. ఈ సమావేశంలో బింగి వేణు, గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, రాచర్ల రమేశ్, పొనగంటి గౌతం తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల డిజిటలైజేషన్

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువులు, బావులు, ఇతర నీటి వనరులను ప్రణాళిక, రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా సందర్శించి గురువారం యాప్ ద్వారా డిజిటలైజేషన్ చేశారు. చిన్న తరహా నీటి వనరుల గణన, జలాశయాల గణన కార్యక్రమంలో భాగంగా నీటివనరులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు జిల్లా ప్రణాళిక అధికారి సత్యం అన్నారు.

గ్రామాల్లో మొదలైన నామినేషన్ల సందడి

కోరుట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామ సర్పంచ్‌లకు 6 నామినేషన్లు, వార్డు సభ్యులకు 5 నామినేషన్ల్ దాఖలు అయినట్లు వివిధ క్లషర్ పరిధిలోని ఎన్నికల అధికారులు తెలిపారు. అయిలాపూర్ క్లస్టర్ పరిధిలోని అయిలాపూర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ కొరకు 1, వార్డు సభ్యుడికి 1 నామినేషన్ దాఖలు అయినట్లు వారు తెలిపారు. మెహన్‌రావుపేట క్లస్టర్ పరిధిలోని మోహన్‌రావుపేట గ్రామ సర్పంచ్‌కు 1, వార్డు సభ్యుడికి 1 నామినేషన్లు, మాదాపూర్ గ్రామ సర్పంచ్‌కు 1, వార్డు సభ్యులకు 2 నామినేషన్ దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. పైడిమడుగు క్లస్టర్ పరిధిలోని జోగినిపల్లి గ్రామ సర్పంచ్‌కు 1, పైడిమడుగు గ్రామంలో 1 వార్డుకు నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. యూసుఫ్ నగర్ క్లస్టర్ పరిదిలోని యూసుఫ్ నగర్ గ్రామ సర్పంచ్‌కు 1 నామినేషన్, గుమ్లాపూర్ క్లస్టర్ పరిధిలోని నాగులపేట గ్రామ సర్పంచ్‌కు 1 నామినేషన్ దాఖలు అయ్యాయి.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గురువారం మండలంలోని సర్పంచు స్థానాలకు జగ్గసాగర్‌లో 1, ఆత్మనగర్ 1, వేంపేట 1, కొండ్రికర్ల 2, రాజేశ్వర్‌పేట 1, సత్తక్కపల్లి 1, వార్డుమెంబర్‌కు ఆత్మకూర్‌లో 2, కొండ్రికర్ల 1, మేడిపల్లి 1, సత్తక్కపల్లిలో 2 స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేసినట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు.

తొలి రోజు సర్పంచ్ స్థానానికి 10 నామినేషన్లు

●**భీమారం:** భీమారం మండలంలో తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 10 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు మెంబర్ స్థానాలకు 11 నామినేషన్లు దాఖలైనట్లు మండల అధికారులు తెలిపారు. భీమారం మండల కేంద్రంలో సర్పంచ్ స్థానానికి 4 నామినేషన్లు దాఖలు కాగా, దేశాయిపేటలో 1, గోవిందారంలో 1, లింగంపేటలో 2, మన్నెగూడెంలో 1, రాగోజీపేటలో ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. వార్డు మెంబర్ స్థానాలకు లింగంపేటలో 9 మంది, ఒడ్యాడ్‌లో ఇద్దరు నామినేషన్లను దాఖలు చేశారు.

●**కథలాపూర్:** మండలంలో సర్పంచ్ స్థానాలకు 13, వార్డు సభ్యులకు 9 నామినేషన్లు స్వీకరించినట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. అంబారిపేట, కలికోట, తాండ్ర్యాల, ఇప్పపల్లి, పోసానిపేట, తక్కళ్ళపల్లి గ్రామాల్లో ఒక్కోటి చొప్పున, దుంపెట, దూలూరు, భూషణరావుపేటలో మూడు చొప్పున నామినేషన్లు వచ్చాయని చెప్పారు.

●**మల్లాపూర్:** మండలంలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు ఐదు, వార్డు మెంబర్‌కు ఒకటి నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ వివరించారు. రాఘవుపేట నుంచి ముగ్గురు, గొర్రెపల్లి, వెంకట్రావుపేట నుంచి ఒక్కో నామినేషన్లు వచ్చాయి. ముత్యంపేట గ్రామ మొదటి వార్డు నుంచి ఒకరు నామినేషన్ సమర్పించారు.

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని ఆయా క్లస్టర్ల పరిధిలో సర్పంచ్ స్థానాలకు నాలుగు నామినేషన్లు, వార్డు మెంబర్ల స్థానాలకు రెండు నామినేషన్లు దాఖలైనట్లు గురువారం అధికారులు తెలిపారు. తిమ్మాపూర్ క్లస్టర్ పరిధిలోని తిమ్మాపూర్ సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్, యామాపూర్ సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు కాగా, గోదుర్‌లో వార్డుమెంబర్ల స్థానాలకు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. అమ్మకపేట్ సర్పంచ్ స్థానానికి ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు.

చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, నవంబర్, 27 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయ లోపంతో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ చేసి వెంటనే హద్దులు నిర్మించి పరిరక్షించాలని అన్నారు. దీనిపై వెంటన్నే స్పెషల్ డ్రైవ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా చెరువులు కుంటల పై ఆదారపడి జీవనోపాధి పొందుతున్న గంగపుత్రులు, ముదిరాజులకు ఉపాధి భరోసా కల్పించినట్లు అవుతుందన్నారు. బెల్ట్‌షాపుల ద్వారా గ్రామాల్లోని గీత కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టేల చర్యలు చేపట్టాలని కోరారు. చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహక లేకపోవడంతోనే చెరువులు, కుంటలు ఆక్రమణకు, ధ్వంసం అవుతున్నాయన్నారు. గత దశాబ్దా కాలంగా రోళ్ళవాగుకు షటర్లు బిగించక పోవడం వల్ల మత్స్యకార్మికులు ఉపాధి లేక తీవ్రగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్ర రాంచందర్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం నాయకులు రంజిత్, ఆకుల రాజిరెడ్డి, కొక్కు గంగారాం, సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లకు 7 వరకు గడువు

రాయికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల 29 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు అవకాశం ప్రత్యేక గడువు కల్పించినట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా బాధ్యులు చెరుకు మహేశ్వర శర్మ, రాయికల్ పాఠశాల సముదాయం ప్రధానో పాధ్యాయుడు శ్రీనివాస్ గురువారం తెలిపారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో టీబీ చాంపియన్లకుకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ టీబీ నిర్మూలన చర్యలు, లక్షణాలపై అవగాహన కల్పించి తీసుకోవల్సిన చర్యలపై సిబ్బందికి వివరించారు.

'ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి'

మల్లాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ రాజా గౌడ్ సూచించారు. గురువారం మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్, ధాంరాజుపల్లి గ్రామాల్లోని ఎన్నికల నామి నేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలకు సంబం ధించి ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. వెంటా తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన ఇబ్రహీం పట్నం మండలంలోని పలు ఎన్నికల నామినేషన్ల కేంద్రాలను పరిశీ లించారు. ఇందులో ఐకేపీ నామినేషన్ కేంద్రం, ఇబ్రహీంపట్నం, తిమ్మాపూర్, వేములకుర్తి, వర్షకుండ తదితర కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు చేశారు. అభ్యర్థుల ఎన్నికల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలి పారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్, ఆర్ఐ రేవంత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కోరుట్ల ఆర్‌డీఓ జివాకర్‌రెడ్డి పరిశీలించారు. సర్పంచ్, వార్డుల కోసం నామినేషన్ వేస్తున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని పేర్కొన్నారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు విధిగా కొత్తగా బ్యాంక్ ఖాతాలు తీసి ఇవ్వాలని అన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ వినోద్, సిబ్బంది ఉన్నారు.